# ఎక్కడి చెత్త అక్కడే

- గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించని కాంగ్రెస్ సర్కార్
- 16 నెలల పాలనలో కంపుకొడుతున్న పల్లెలు
- నిండిన మురుగు కాల్వలు.. పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- గత బీఆర్ఎస్ హయాంలో పరిశుభ్రంగా పల్లెలు



కాల్వలో నిండిన మురుగు



మురుగు కాల్వను శుభ్రం చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్(ఫైల్)

వికారాబాద్, ఏప్రిల్ 6 : బీఆర్ఎస్ హయాంలో పల్లెలు పరిశుభ్రతకు నిలయాలుగా మారగా.. 16 నెలల కాంగ్రెస్ పాలనలో గ్రామాలు చెత్తాచెదారంతో నిండిపోయి సమస్యలతో సహవాసం చేస్తున్నాయి. కేసీఆర్ హయాంలో ప్రతిరోజూ పారిశుధ్య కార్మికులు గ్రామాలను ఉదయమే శుభ్రం చేసి.. చెత్తాచెదారాన్ని ట్రాక్టర్లలో కంపోస్ట్ షెడ్లకు తరలించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవ డంతో పల్లెలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో గత కొన్ని రోజులుగా ట్రాక్టర్ నడవడం లేదు. ట్రాక్టర్‌లో పోసేందుకు డీజిల్‌కూ డబ్బుల్లేకపోవడంతో దానిని మూలకు పడేశారు. పెద్ద గ్రామ పంచాయతీ అయిన గొట్టిముక్కలకు అనుబంధ గ్రామంగా ఐనాపూర్ ఉన్నది. ఇక్కడ 660 ఇండ్లు, 2500 జనాభా ఉన్నది. ఐనాపూర్ ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఇక్కడ ఐదుగురు పారిశుధ్య కార్మికులు, నలుగురు పార్ట్‌టైమ్ వర్కర్లు పనిచేస్తున్నారు. గత నాలుగైదు నెలలుగా వారికి జీతాలు సక్రమంగా రాకపోవడంతో పారిశుధ్య పనులను చేపట్టేందుకు వారు ఆసక్తి చూపడం లేదు. కుటుంబం గడిచేందుకు ఇతర కూలీ పనులకు వెళ్తుండడంతో.. గ్రామంలో చెత్తాచెదారం ఎక్కడికక్కడ పేరుకుపోయి కంపు కొడుతున్నది. మురుగు కాల్వలు రోడ్లపై పారుతున్నాయి. ఇండ్ల మధ్య మురుగు చేరి పందులకు ఆవాసంగా మారింది. గత ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి లేదని.. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాతే గ్రామాలకు ఈ పరిస్థితి వచ్చిందని పలువురు మండిపడుతున్నారు.



గ్రామంలోని చెత్తను తీసుకెళ్తున్న ట్రాక్టర్(ఫైల్)

### మురుగు కాల్వలను శుభ్రం చేయించాలి



ఇంటి ముందు ఉన్న పెద్ద కాల్వలో మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తున్నది. ప్రతిరోజూ ఈగలు, దోమలు ఇండ్లలోకి వచ్చి కుడుతున్నాయి. పారిశుధ్య కార్మికులు రాకపోవడంతో చెత్తాచెదారం ఎక్కడికక్కడ పేరుకుపోయి కంపు కొడుతున్నది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

-బుడ్డమ్మ, గొట్టిముక్కల

## సాంకేతికతను అందిపుచ్చుకోవాలి




విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

విద్యార్థులు ఉన్నతమైన ఆశయాలతో సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మరో రెండు దశాబ్దాల్లో వికసిత్ భారత్ అవుతుందని, విద్యార్థులు అందులో భాగస్వాములు కావాలన్నారు. అకడమిక్ టాపర్లు, క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హృదయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఉదయ్ కిరణ్, కాలేజీ చైర్మన్ వినయ్‌కుమార్‌రెడ్డి, సెక్రటరీ రవీంద్రనాథ్‌యాదవ్, సీఈవో శరత్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 6



### పాతాళ గంగ కోసం..
## పట్టువదలని ప్రయత్నం
#### బావిలో పూడిక తీయిస్తున్న రైతు



నాకు ఏడెకరాల పొలం ఉన్నది. అందులోని రెండెకరాల్లో రూ. లక్ష ఖర్చు చేసి వరి పంటను సాగు చేశా. ఉన్న బావి ఎండిపోవడంతో రూ. మూడు లక్షలు వెచ్చించి కొత్తగా మూడు బోర్లు తవ్వించా.. భూగర్భజలాలు అడుగంటడంతో అవి చుక్క నీరు పోయడం లేదు. బావిలో పూడిక తీయిస్తే పాతాళ గంగమ్మ పైకి వస్తుందనే ఆశతో రూ. రెండు లక్షలు వెచ్చించి పూడికతీత పనులను ప్రారంభించా. ఇప్పటికీ తనకు రైతుభరోసా రాలేదు.. బ్యాంకులో తీసుకున్న రూ. లక్ష పంట రుణం కూడా మాఫీ కాలేదు. రైతుభరోసా వస్తుందనే ఆశతో ప్రతిరోజూ ఫోన్‌ను చూసుకుంటున్నా. కాంగ్రెస్ సర్కార్ వచ్చిన తర్వాత అన్నదాతల కష్టాలు రెట్టింపయ్యాయి. కేసీఆర్ ఉన్నప్పుడే చాలా బాగుండే. ప్రజలందరూ సంతోషంగా ఉన్నారు.

-కర్నాటి కృష్ణారెడ్డి, ముర్తుజాపల్లి, ఆమనగల్లు



# చేతిపంపే దిక్కాయే..

- రాఘవాపూర్‌లో నీటి కష్టాలు
- రెండు రోజులుగా సరఫరా కాని మిషన్ భగీరథ నీరు

పరిగి, ఏప్రిల్ 6 : ఓ వైపు వేసవికాలం మరోవైపు నీటి ఇబ్బందులతో రాఘవాపూర్ గ్రామస్తులు సతమతమవుతున్నారు. రెండు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరిగ్గా రాకపోవడంతో వారికి నీటి కష్టాలు మరింత పెరిగాయి. గ్రామానికి ఎగువనే మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్ ఉన్నా కష్టాలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో శనివారం కొంత మేర నీటి సరఫరా జరుగగా ఆదివారం మిషన్ భగీరథ నీరు అసలే రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని వాపోతున్నారు. గ్రామంలో రెండు సింగిల్ ఫేస్ మోటర్లు గల బోర్లు ఉన్నా .. నీరు సరిపడా రాకపోవడంతో చేతిపంపులే దిక్కు అయ్యాయని పేర్కొంటున్నారు.

గ్రామానికి ఎగువన జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల ప్రజల దాహార్తిని తీర్చే మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్ ఉండగా తమకు ఈ కష్టాలు ఏమిటని అధికారులను ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీరు సరిపడా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రాజెక్టు నిండా నీరున్నా..
### ఎండుతున్న పంటలతో దీనస్థితిలో అన్నదాత

పెద్దేముల్, ఏప్రిల్ 6 : వికారాబాద్ జిల్లాలో కోట్‌పల్లి ప్రాజెక్టు తలమాణికం. జిల్లా మొత్తానికి ఒక టీఎంసీ సామర్థ్యం గల ఒకే మధ్యతరహా ప్రాజెక్టు. దీని కింద 9200 ఎకరాల ఆయకట్టు ఉన్నది. కానీ, ఇప్పుడు కాల్వలన్నీ శిథిలావస్థకు చేరాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రాజెక్టు కింద ఉన్న రైతులను అసలే పట్టించుకోవడం లేదు. ఒక్క జనగాం గ్రామంలోనే 2000 ఎకరాల ఆయకట్టు ఉండగా.. ఈ యాసంగిలో 500 ఎకరాలకు కూడా నీరందడం లేదు. దీంతో అన్నదాతలు కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రధాన కాల్వల్లో పూడిక తీసుకుంటూ వచ్చినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. నీరందక పంటలు ఎండుతుండడంతో రైతన్న కన్నీరుమున్నీరవుతున్నాడు.





నీటితో నిండుగా ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టు
ప్రధాన కాల్వలో అడ్డుగా ఉన్న చెత్తను తొలగిస్తున్న రైతులు

### ప్రభుత్వం పట్టించుకోవడంలేదు..

కోట్‌పల్లి ప్రాజెక్టులో నిండా నీరున్నా.. దాని ఆయకట్టు కింద ఉన్న పొలాలకు మాత్రం నీరందడం లేదు. కాల్వలన్నీ శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వం, అధికారులు అసలే పట్టించుకోవడం లేదు. కొందరు రైతులు కాల్వల్లో మోటర్లు పెట్టి తమ పంటలను కాపాడుకుంటున్నారు. రూ. రెండు లక్షలు పెట్టి మూడు బోర్లు వేయించినా ఫలితం లేదు. రెండున్నర ఎకరాల్లోని పంట ఎండిపోయింది. చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించడంలేదు.

- వడ్డె హన్మప్ప, రైతు, జనగాం, పెద్దేముల్



### మాన్‌సూన్
# యాక్షన్ ప్లాన్ ఇంకెప్పుడో?

- టెండర్ల దశలోనే ప్రక్రియ
- కాంట్రాక్టర్లకు రూ.1500 కోట్ల పెండింగ్ బకాయిలే కారణం

సిటీబ్యూరో, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): వర్షాకాల సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తుగా సమాయత్తం కావాల్సిన జీహెచ్ఎంసీ మీనమేషాలు లెక్కిస్తున్నది. మే నెలాఖరు నాటికల్లా మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ అమలుకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాల్సిన అధికారులు ప్రతిపాదనలు రూపొందించడంలో తాత్సారం చేస్తున్నారు. ప్రతి ఏటా దాదాపు రూ. 33 కోట్లతో మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి ఇందుకు సంబంధించి పనులకు టెండర్లు పిలవాల్సి ఉంటుంది. ఏరియాల వారీగా 140 బృందాలు, ప్రత్యేక వాహనాలు, స్టాటిక్ లేబర్స్, మినీ మొబైల్ మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేసి వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ఐఆర్టీ పనులకు ఇప్పటికే టెండర్లు పిలవాల్సిన అధికారులు జాప్యం చేస్తున్నారు. ఇటీవల కమిషనర్ మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ ఖరారు చేయాలని ఆదేశించినా ఇప్పటివరకు పురోగతి లేకపోవడం ఇంజినీరింగ్ అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది.

#### గత అనుభవాలను పట్టని యంత్రాంగం

వర్షాకాల విపత్తును ఎదుర్కొని ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధం కావాలి. అయితే గతేడాది ఐఆర్టీ బృందాల ఏర్పాటులో తీవ్ర జాప్యం చేశారు. జూలై వరకు ఎమర్జెన్సీ బృందాలను సిద్ధం చేయలేదు ..ప్రధానంగా ఈ పనులకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు...పెండింగ్ బకాయిలు రూ. 1500 కోట్లు చెల్లిస్తేనే టెండర్లలో పాల్గొంటామని తేల్చి చెప్పడంతో మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ టెండర్లు స్పందన లేకపోవడంతో జాప్యం జరిగింది. గత అనుభవాలతోనైనా అధికారులు ఈ ఏడాది ముందస్తుగా కార్యాచరణలో ఆదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కాంట్రాక్టర్లు సైతం ఇప్పటి వరకు పెండింగ్ బకాయిల క్లియరెన్స్ చేయలేదని, జూన్ నాటికల్లా రూ.400కోట్ల మేర బకాయిలు చెల్లిస్తారని చెప్పారే తప్ప ఆ దిశగా ప్రయత్నాలు జరగలేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. బకాయిలు వస్తేనే జీహెచ్ఎంసీ చేపట్టబోయే పనులకు ఆసక్తికనబరుస్తామని సదరు కాంట్రాక్టర్లు చెబుతుండడంతో ఈ పనుల టెండర్లపై అధికారులు కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు . మొత్తంగా ఈ నెల 3వ తేదీన కురిసిన 9 సెంటీ మీటర్ల అకాలవర్షంతో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బృందాలను ముందస్తుగా రెడీగా ఉంచాలని పౌరులు కోరుతున్నారు.

# నాలుగు నెలలుగా వేతనాల్లేవ్
### డెలివరీ ఎంట్రీ ఆపరేటర్లపై సర్కారు చిన్నచూపు

సిటీబ్యూరో: తమది ప్రజాపాలనంటూ గొప్పలు చెప్పుకొనే కాంగ్రెస్ సర్కారు ఉద్యోగులపాలిట శాపంగా మారింది. సకాలంలో వేతనాలివ్వకుండాఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు ఎంట్రీ చేసే డెలివరీ ఎంట్రీ ఆపరేటర్ల కు(డీఈవో) గత నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో వారంతా ఇబ్బందులకు గురవుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ సర్కారు దవాఖానాల్లో ప్రసవాలు పెంచడమే లక్ష్యంగా కృషి చేసింది. అందులో భాగంగానే 2017 జూన్ 2న ప్లేట్ల బురుజు ఆసుపత్రి కేంద్రంగా కేసీఆర్ కిట్ పథకాన్ని స్వయంగా నాటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ప్రభుత్వ అసుపత్రుల్లో ప్రసవించే వారికి రూ.2000 విలువ చేసే కేసీఆర్ కిట్‌లో తల్లి, శిశువులకు చెందిన 16 రకాల వస్తువులతో పాటు మగపిల్లవాడు జన్మిస్తే రూ.12000, ఆడబిడ్డ జన్మిస్తే రూ.13000 గత సర్కారు చెల్లించింది. దీనివల్ల ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరుగుతూ వచ్చింది. కేసీఆర్ కిట్ అందించడంలో డీఈవోలు ప్రముఖ పాత్ర పోషించారు. పొరుగుసేవల ప్రాతిపదికన నియమించబడ్డ ఈ ఉద్యోగులంతా ప్రసవాలు నమోదు చేయడం, కిట్ వివరాలు లబ్ధిదారులకు వివరించడం, టీకాలు, నెలనెలా చెకప్‌లు వంటి పనులు నిర్వహించడంలో నిరంతరం కష్టపడ్డారు. గత ప్రభుత్వంలో ఎంతో మెరుగ్గా పని చేసిన వీరంతా నేడు వేతనాలందక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 140 మంది డీఈవోలు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రతినెలా రూ.36 లక్షలు వేతనాలకోసమని ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. అయితే గత నాలుగు నెలల నుంచి డీఈవోలకు వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటి అద్దెలు, ఈఎంఐలు కట్టలేక అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల రాష్ట్ర బడ్జెట్‌లో మాతా శిశు కిట్, ఉద్యోగుల వేతనాలకోసమని సుమారు రూ.160 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ నేటివరకు ఉద్యోగులకు వేతనాలు అందించకపోవడం గమనార్హం.

# విత్తన సంరక్షణలో మహిళలకు ప్రాధాన్యమిస్తాం
#### వ్యవసాయం, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న కోదండరెడ్డి

కడ్తాల్, ఏప్రిల్ 6 : విత్తన సంరక్షణలో మహిళలకు ప్రాధాన్యమిస్తామని వ్యవసాయం, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. మండలంలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో గల ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్-భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన తెలంగాణ వార్షిక విత్తనాల పండుగ ఆదివారం సాయంత్రం ముగిసింది. చివరి రోజు విత్తనాల పండుగకు ముఖ్యఅతిథులుగా ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి, రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి, ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ, పర్యావరణవేత్తలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ.. కల్తీ విత్తనాలను అరికట్టాలన్నారు. వ్యవసాయాభివృద్ధికి 2004లోనే 20 అంశాలతో కూడిన ముసాయిదాను రూపొందించామని, దానిని అమలు చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. విత్తన సంరక్షణలో మహిళా రైతులకు ప్రాధాన్యమివ్వాలని, కూరగాయలు, ధాన్యాల విత్తనాలను భద్రపరిచే విధానాన్ని పునర్జీవింపజేయాలని సూచించారు. పంట మార్పిడి విధానంలో మిశ్రమ పంటలతో రైతులు సాగును చేపట్టాలన్నారు. అనంతరం రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి, సుద్దాల అశోక్ తేజ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ విధాన విశ్లేషకుడు దొంతి నర్సింహారెడ్డి రచించిన ఆరోగ్యానికి ఆహార భద్రత విత్తనం అనే పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. విత్తనాల పండుగ సందర్భంగా సీజీఆర్ సంస్థ ఆధ్వర్యంలో విత్తనాభివృద్ధి కోసం భవిష్యత్ తరాల మేలుకోసం 20 అంశాలపై తీర్మానాలు చేశారు. ఎర్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన దేశీ విత్తనాలను ప్రదర్శనను ఎంపీ, ఎమ్మెల్యే సందర్శించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యవసాయ సంస్థల నిపుణులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, పర్యావరణవేత్తలు, మేధావులు, రైతు సంఘాల నాయకులు, సీజీఆర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంకా కొలిక్కిరాలే..

- ఓల్డ్ సిటీ భూసేకరణకు తొలగని అడ్డంకులు
- ఫేస్-2లో కీలకంగా మారిన ప్రాజెక్టు
- 100 మతపరమైన ఆస్తుల విషయంలో చిక్కులు



సిటీబ్యూరో, ఏప్రిల్ 6(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన ఓల్డ్‌సిటీ మెట్రోకు ఇంకా చిక్కులు తొలగలేదు. పాత నగరానికి మెట్రో నిర్మాణంతో మంచి రోజులు వస్తాయంటూ ఇచ్చిన హామీలన్నీ భూసేకరణ వద్దనే నిలిచిపోతున్నాయి. రెండున్నర కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని పొడిగించామని చెప్పుకొంటున్నా ... క్షేత్రస్థాయిలో మాత్రం రెండు అడుగుల భూసేకరణకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చారిత్రక, వారసత్వ, మతపరమైన నిర్మాణాల విషయంలో వేగంగా నిర్ణయం తీసుకోలేక, భూసేకరణ చేయడమే అధికారులకు గగనంగా మారింది. దీంతో ప్రాజెక్టుకు భూములు ఇస్తే గానీ మెట్రో నిర్మాణం కొలిక్కి వచ్చేలా లేదు.

#### వీడని గ్రహణం


తొలి దశలోనే పూర్తి కావాల్సిన ఓల్డ్ సిటీ మెట్రో నిర్మాణానికి గ్రహణం వీడటం లేదు. రెండో దశలో రెండున్నర కిలోమీటర్లు పొడిగించి ప్రాజెక్టు పనులు చేపట్టినా..క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులతో ప్రాజెక్టు అనుకున్నంత వేగంగా ముందుకు సాగే పరిస్థితి కనిపించడంలేదు. మూడు నెలల్లో భూసేకరణ పూర్తి చేసి, నిర్మాణాల తొలగించిన వెంటనే నిర్మాణానికి చర్యలు చేపట్టాలనే ప్రతిపాదనలున్నా... నిత్యం ఎదురవుతున్న అవాంతరాలు ప్రాజెక్టును నిలవరిస్తున్నాయి. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు పొడిగించిన ఈ మార్గంలో దాదాపు 900 ఆస్తులను సేకరించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఏడున్నర కిలోమీటర్ల మేర నిర్మించే ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట వరకు మెట్రో విస్తరణను రూ. 2741 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టారు. ఫేస్-2 విస్తరణలో భాగంగా దాదాపు 1000కిపైగా ఆస్తులు ప్రభావితం అవుతున్నట్లు గుర్తించారు. ఇందులో మెట్రోకు అంగీకారం తెలిపిన వారి సంఖ్య వంద లోపే ఉంది. భూయాజమాన్య హక్కుల పరిశీలన తర్వాత కొంత మందికి చెక్కులను పంపిణీ చేశారు. మిగిలిన వారు కూడా త్వరగా ముందుకొస్తే భూసేకరణ ప్రక్రియ పూర్తికి ఆస్కారం ఉంటుంది.

#### అత్యంత కీలకం..

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మించే మెట్రో మార్గం హైదరాబాద్ మెట్రో విస్తరణలో అత్యంత కీలకమైంది. మొదటి దశలోనే ఈ ప్రాజెక్టు పూర్తి కావాల్సి ఉన్నా... క్షేత్రస్థాయిలో భూసేకరణ ఇబ్బందులు, కోర్టు వివాదాలు ప్రాజెక్టు పనులకు అడ్డు పడ్డాయి. దీంతో అప్పటి నుంచి ప్రతిపాదనలు, కాగితాలకే ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ పరిమితమైంది. అయితే ఇటీవల ఓల్డ్ సిటీ మెట్రో జాప్యంపై తీవ్ర విమర్శలు రావడంతో... అనివార్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఓల్డ్ సిటీ మెట్రోను చాంద్రాయణ్‌గుట్ట వరకు పొడిగించి కొత్తగా కార్యాచరణ అమలు చేసింది. ఈ క్రమంలో పరిహారానికి భారీ మొత్తంలో ఖర్చు చేయనుండగా... భూసేకరణ ప్రక్రియ పూర్తి అయితే గానీ, మెట్రో నిర్మాణ పనులు మొదలు కానీ పరిస్థితి నెలకొని ఉంది. దీంతో ప్రాజెక్టు నిర్మాణ పనులు ఇంకా సందిగ్ధంలోనే కొట్టుమిట్టాడుతున్నాయి.

### కరెంటు పోయిందంటే..
# తప్పేనట..

- ఫిర్యాదు చేస్తే..బెదిరింపులే..
- వినియోగదారులకు ఎస్పీడీసీఎల్ షాక్
- గృహజ్యోతి లబ్ధిదారులకు పథకం కట్



సిటీబ్యూరో, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): కరెంట్ పోయిందని కాంప్లైంట్ చేస్తున్నారా.. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారా.. ఎన్ని గంటలు కరెంట్ తీసేస్తారంటూ ప్రశ్నిస్తున్నారా.. అయితే మీకు కరెంట్ బిల్ షాక్ తప్పదు. ఎవరైనా మా ఏరియాలో ఫలానా సర్వీసులో కరెంట్ పోయిందని సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే చాలు.. వారికి సిబ్బంది నుంచి వేధింపులు తప్పట్లేదని కొందరు వినియోగదారులు చెప్పారు. ఇటీవల వర్షాలకు పవర్ కట్స్ సందర్భంలో చాలామంది వినియోగదారులు ఫిర్యాదు చేశారు. కొన్ని చోట్ల సమస్యలు పరిష్కరించినప్పటికీ..మరికొందరు వినియోగదారులకు మాత్రం విద్యుత్ సిబ్బంది నుంచి బెదిరింపులు తప్పలేదు. మీరెందుకు ఫిర్యాదు చేశారంటూ కొందరు వినియోగదారులను సిబ్బంది ఏకంగా ఇంటికే వచ్చి అడిగినట్లు తెలిసింది. ఇక కొందరికేమో తమ ఏరియాలో కరెంట్ పోయిందంటే మీ సర్వీస్ నంబర్ ఎంత అంటూ అడిగి ఒకవేళ వారు ఇవ్వకపోతే వారి ఫిర్యాదులకు స్పందించకపోవడం వంటివి చేస్తున్నారు.

#### కరెంటు పోయిందని ఫిర్యాదు చేస్తే..

గత వారంలో కురిసిన అకాలవర్షాలకు తమ వద్ద కరెంట్ పోయిందని ఒక వినియోగదారుడు ఫిర్యాదు చేస్తే అతని గృహజ్యోతి పథకం కట్‌చేశారు. కాటేదాన్‌లోని గగన్‌పహాడ్ సెక్షన్ లక్ష్మీగూడకు చెందిన గడ్డం సమతకు సంబంధించిన కరెంట్ బిల్లు విషయంలో విద్యుత్ సిబ్బంది ఇలాంటి బెదిరింపులకు దిగారు. ఈనెల 3న వినియోగదారుడు తమ ప్రాంతంలో కరెంట్ పోయిందంటూ సోషల్ మీడియాలో టీజీఎస్‌పీడీసీఎల్‌కు ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా తన వివరాలు కూడా ఇచ్చారు. అయితే మీరు ఎందుకు ఫిర్యాదు చేశారంటూ సంబంధిత ఏరియాకు చెందిన విద్యుత్ సిబ్బంది అక్కడకు వచ్చి వారికి కరెంట్ బిల్లు ఇచ్చారు. ఈ బిల్లులో తాము గత నెల వరకు గృహజ్యోతి లబ్ధిదారులైనప్పటికీ ఈ ఫిర్యాదు చేసిన తెల్లవారే వచ్చి కరెంట్ బిల్లు ఇచ్చి అందులో గృహజ్యోతి లేకుండా బిల్లు వేశారని ఆ వినియోగదారుడు వాపోయాడు. ఇందుకు సంబంధించిన రెండు బిల్లులను అదే సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వీటిపై సమాధానమివ్వాలంటూ నిలదీసినా విద్యుత్ సిబ్బంది నుంచి ఎలాంటి స్పందనా లేదు. మార్చి 6న ఇచ్చిన బిల్లులో 185 యూనిట్లు కాగా బిల్లు రూ.906లుగా వచ్చింది. దీనికి సబ్సిడీగా రూ.906లు చూపించి జీరో బిల్లు చేశారు. అదే వినియోగదారుడికి ఈనెల 4న బిల్లు ఇచ్చి అందులో 199 యూనిట్లు కరెంట్ వినియోగం జరగగా.. రూ.1206లు బిల్లుగా ఇచ్చారు. ఈ బిల్లుపై గృహజ్యోతి పథకం లబ్ధిదారుడుగా లేకుండా కేవలం ఫిర్యాదు చేసినందుకే ఇలా చేశారని ఆ వినియోగదారుడు వాపోతున్నాడు. అయితే మార్చి నెల బిల్లు 28 రోజులకు తీస్తే..ఏప్రిల్ నెల బిల్లును 29 రోజులకు తీసి యావరేజ్ మంత్ యూనిట్స్ 213గా చూపిస్తున్నారని, ఇదంతా కేవలం తాము ఫిర్యాదు చేసినందుకే అని సదరు వినియోగదారుడు చెప్పారు. అయితే ఈ విషయంపై సంబంధిత అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నిస్తే ఈ బిల్లు వ్యవహారమంతా తమ పై అధికారులకే తెలుసని చేతులెత్తేశారు. మరి గృహజ్యోతి వినియోగదారులైనంతమాత్రాన కరెంట్ పోతే ఫిర్యాదు చేయకూడదా అంటూ వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

### మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలి

ఖైరతాబాద్, ఏప్రిల్ 6 : హైదరాబాద్ వేదికగా మేలో నిర్వహించనున్న మిస్ వరల్డ్ అందాల పోటీలను రద్దు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్, ఆల్ ఇండియా డెమోక్రటిక్ యూత్ ఆర్గనైజేషన్, ఆల్ ఇండియా మహిళా సాంస్కృతిక సంఘం సంయుక్తాధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడారు. ఆడపిల్లలను ఓ శాస్త్రవేత్త, వ్యాపారవేత్త, విద్యావేత్తగా చూపించాల్సి ఉండగా..కమర్షియల్ మార్కెటింగ్ కోసం అందాల పోటీలను నిర్వహిస్తూ మరోసారి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. ఆలిండియా మహిళా సాంస్కృతిక సంఘం రాష్ట్ర కన్వీనర్ హేమలత, అటవీ శాఖ విశ్రాంత డిప్యూటీ సెక్రటరీ కృష్ణవేణి, రచయిత, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.